మనదేశం వజ్రోత్సవ వేడుక



మహానటుడు, నటరత్న పద్మశ్రీ డా.ఎన్టీరామారావు నటించిన తొలి సినిమా 'మనదేశం' 1949 నవంబర్ 24న విడుదలైంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా చిన్న పాత్రను పోషించారు. ఎల్వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి మీర్జాపూర్ రాజావారు నిర్మాత. ఈ సినిమా విడుదలై 75ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 14న విజయవాడలో ఘనంగా 'మనదేశం వజ్రోత్సవ వేడుకను' నిర్వహించాలని తెలుగు చిత్రపరిశ్రమ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇటీవల తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి హైదరాబాద్ కార్యాలయంలో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర వాణిజ్యమండలి, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, తెలుగు సినీ రైటర్స్ అసోసియేషన్, తెలుగు సినీ దర్శకుల సంఘం అందరూ కలిసి ఈ సమావేశంలో పాల్గొని, విజయవాడలో జరగబోయే వేడుక గురించి చర్చించారు. అందరూ కలిసికట్టుగా, ఘనంగా ఈ వేడుకను జరపాలని సినీ సంఘాల సభ్యులంతా ఏకగ్రీవంగా నిర్ణయించారు.

టీఎఫ్‌డీసీ చైర్మన్‌గా దిల్‌రాజు

ప్రముఖ నిర్మాత దిల్‌రాజును కీలక పదవి వరించింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్(టీఎఫ్‌డీసీ) చైర్మన్‌గా ఆయన్ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో దిల్‌రాజు రెండేళ్లపాటు కొనసాగుతారు. దిల్‌రాజు అసలు పేరు వి.వెంకటరమణారెడ్డి. 'పెళ్లిపందిరి'(1997) సినిమాతో పంపిణీదారునిగా ఆయన సినీ కెరీర్ మొదలైంది. దిల్, ఆర్య, బొమ్మరిల్లు చిత్రాలతో అగ్రనిర్మాతగా ఎదిగారాయన. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై యాభైకి పైగా చిత్రాలు నిర్మించారు. దిల్‌రాజు నిర్మించిన భారీ పాన్‌ఇండియా సినిమా 'గేమ్ చేంజర్'.. ఈ సంక్రాంతికి విడుదల కానుంది.

ఐటమ్‌సాంగ్స్ ఇక చేయను

'కిస్సిక్' అంటూ 'పుష్ప2'లో శ్రీలీల చేసిన సందడి అంతా ఇంతా కాదు. తనందులో చేసింది ఓ పాటే అయినా.. హీరోయిన్‌కి వచ్చినంత పేరొచ్చింది. అయితే.. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం శ్రీలీల కెరీర్‌లో తొలి ఐటమ్ సాంగ్.. చివరి ఐటమ్ సాంగ్ కూడా 'కిస్సిక్' సాంగేనట. ఇక జీవితంలో తను ఐటమ్ నంబర్ చేయదని తెలుస్తున్నది. నిజానికి చిరంజీవి 'విశ్వంభర'లో కూడా ఓ ఐటమ్ సాంగ్‌కి శ్రీలీలను అడిగారు. ఆ ఆఫర్‌ని తను సున్నితంగా తిరస్కరించిందని ఫిల్మ్‌వర్గాల భోగట్టా. అయితే.. 'పుష్ప2'కు ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకొని, తొలి పార్ట్‌లో సమంత ఐటమ్ సాంగ్ చేసింది కాబట్టి, మలి పార్ట్‌లో తాను చేయడం సబబేనని భావించి ఈ పాటను శ్రీలీల అంగీకరించిందని తెలుస్తున్నది. రీసెంట్‌గా ఇలాంటి ఆఫర్లు ఎన్ని వస్తున్నా.. ఎంత పారితోషికాన్ని ఆఫర్ చేస్తున్నా శ్రీలీల మాత్రం కేర్ చేయడం లేదట. 'చేస్తే హీరోయిన్‌గానే చేస్తా.. లేకపోతే ఖాళీగా ఉంటా.. అంతేకానీ.. ఐటమ్ సాంగ్స్ మాత్రం చేయను' అని ఖరాకండీగా చెప్పేస్తున్నదట. ఈ నెల 25న నితిన్‌కు జోడీగా ఆమె నటించిన 'రాబిన్‌హుడ్' సినిమా విడుదల కానుంది. అంతే కాక, తమిళంలో శివకార్తికేయన్‌తో కూడా ఓ సినిమా చేస్తున్నది శ్రీలీల.

సుకుమార్ వల్లే ఈ విజయం

'సంధ్య థియేటర్‌లో జరిగిన ఘటన మమ్మల్ని ఎంతగానో కలచివేసింది. మనిషిలేని లోటును ఎవరూ తీర్చలేరు. అందుకు మేమంతా ఎంతగానో విచారిస్తున్నాం. కొద్ది రోజుల తర్వాత ఆ కుటుంబాన్ని వెళ్లి కలుస్తాను' అన్నారు అల్లు అర్జున్. ఆయన కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఏర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన 'పుష్ప-2' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా భారీ విజయాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్‌లో చిత్ర బృందం సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ 'ఈ సినిమా సక్సెస్ విషయంలో పూర్తి క్రెడిట్ సుకుమార్‌దే. ఆయన వల్లే ఆ స్థాయి విజయం సాధ్యమైంది. కలెక్షన్స్ గురించి తెలుసుకుంటుంటే సినిమాను ఎంతమంది ప్రేక్షకులు చూశారో అర్థమవుతున్నది. ఈ సినిమా విషయంలో మాకు సహాయాన్నందించిన అన్ని ఇండస్ట్రీలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మనందరిని గర్వంగా చెప్పుకునేలా చేస్తుందనే నమ్మకంతోనే ఈ సినిమా తీశాం' అన్నారు. సుకుమార్ మాట్లాడుతూ 'నా కెరీర్‌పరంగా సినిమాపరంగా కృతజ్ఞతలు చెపాల్సింది తొలుత రాజమౌళికే. ఆయన పట్టుబట్టడం వల్లే పుష్పను హిందీలో విడుదల చేశాం. మాది పాన్ ఇండియా సినిమా అని నమ్మింది, మాకు నమ్మకాన్ని ఇచ్చింది ఆయనే. వాస్తవానికి గత మూడు రోజులుగా నేను ఆనందంగా లేను. థియేటర్ వద్ద జరిగిన ఘటనతో నా మనసు వికలమైంది. వారి కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటాం' అని చెప్పారు. నిర్మాత నవీన్ ఏర్నేని మాట్లాడుతూ 'ఫాస్టెస్ట్ 500 క్రోర్ ఇండియన్ మూవీ. మా అంచానలను మించి రికార్డులు సృష్టించేలా అనిపిస్తున్నది. ఇప్పుడు ఈ సినిమా గురించి దేశం మొత్తం మాట్లాడుకుంటున్నది' అన్నారు. మరో నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'భాషా సరిహద్దులను చెరిపి వేసి తెలుగు సినిమా శిఖరాగ్రానికి చేరడం ఆనందంగా ఉంది' అన్నారు.

యూనివర్సల్ కాన్సెప్ట్‌తో తీశాం

సాధారణంగా సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలను ఫ్యామిలీ ఆడియెన్స్ చూడటానికి అంతగా ఇష్టపడరు. కానీ 'ఫియర్' అందుకు భిన్నంగా అందరూ చూసేలా ఉంటుంది' అని చెప్పారు దర్శకురాలు డా॥ హరిత గోగినేని. ఆమె దర్శకత్వంలో వేదిక ప్రధాన పాత్రలో నటించిన 'ఫియర్' చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో డా॥ హరిత గోగినేని పాత్రికేయులతో మాట్లాడుతూ 'మూడేళ్ల క్రితం ఈ సినిమా ఆలోచన మొదలైంది. 'భయం' గురించిన కాన్సెప్ట్ కాబట్టే అదే టైటిల్‌గా పెట్టాలనుకున్నాం. అయితే అన్ని భాషలకు రీచ్ అయ్యేలా 'ఫియర్' టైటిల్‌ను ఎంచుకున్నాం. ఈ సినిమా వివిధ అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో 70కిపైగా అవార్డులను గెలుచుకుంది. తెలుగులో విడుదలైన తర్వాత మిగతా భాషల్లో రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పింది. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశామని, రెగ్యులర్ సస్పెన్స్ థ్రిల్లర్స్‌కు భిన్నంగా ఉంటుందని హరిత గోగినేని పేర్కొంది. చిన్న చిత్రాలకు కంటెంట్ ప్రధానమని, అదే ఉద్దేశంతో నిజాయితీగా ఈ సినిమాను తెరకెక్కించామని, త్వరలో ఓ యాక్షన్ మూవీతో పాటు కామెడీ ఎంటర్‌టైనర్‌కు ప్లాన్ చేస్తున్నామని హరిత గోగినేని చెప్పింది.

వైవిధ్యమైన ప్రేమకథ

అగ్ర కథా నాయిక రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. దీక్షిత్‌శెట్టి కథానాయకుడిగా నటిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 9న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా శనివారం కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. 'వైవిధ్యమైన ప్రేమకథా చిత్రమిది. రష్మిక మందన్న పాత్ర నవ్యరీతిలో సాగుతుంది. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశలో ఉంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది. రష్మిక కెరీర్‌లో ఓ విభిన్నమైన సినిమాగా మిగిలిపోతుంది' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కృష్ణన్ వసంత్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, ప్రొడక్షన్ డిజైన్: ఎస్.రామకృష్ణ, మౌనిక నిగోత్రి, సమర్పణ: అల్లు అరవింద్, రచన-దర్శకత్వం: రాహుల్ రవీంద్రన్.

మ్యాజిక్ ఎక్స్‌పీరియన్స్ కోసం..

'మిస్టర్ బచ్చన్' సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించింది పూణే భామ భాగ్యశ్రీబోర్సే. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే చేస్తున్న క్రేజీ ప్రాజెక్టుల్లో 'కాంత' ఒకటి. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తూ, రానా దగ్గుబాటితో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఇటీవలే ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. రీసెంట్‌గా ఈ సినిమా షూటింగ్ కూడా మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ లొకేషన్‌లో దుల్కర్‌తో కలిసి ఉన్న తన ఫొటోను ఇన్‌స్టాలో షేర్ చేసింది భాగ్యశ్రీ బోర్సే. 'కాంత' ప్రపంచంలో మ్యాజిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఆస్వాదించడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా..' అంటూ ఆ ఫొటోతో పాటు కామెంట్ కూడా జత చేసింది. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో 1950 నాటి మద్రాసు మహానగరంలో జరిగిన కథగా ఈ సినిమాను దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ తెరకెక్కిస్తున్నారు. సముద్రఖని కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు.

మూర్ఖత్వం హద్దులు దాటితే..

'మనందరం జీవితంలో తెలిసోతెలియకో తప్పులు చేస్తుంటాం. అయితే అనాలోచితంగా సరిదిద్దుకోలేని తప్పులు చేయొద్దనే పాయింట్‌ను బలంగా చెబుతూ ఈ సినిమా తీశాం' అన్నారు సుబ్బు మంగాదేవి. ఆయన దర్శకత్వంలో అల్లరి నరేష్ కథానాయకుడిగా నటించిన 'బచ్చల మల్లి' చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం దర్శకుడు సుబ్బు మంగాదేవి పాత్రికేయులతో మాట్లాడుతూ 'ఈ సినిమాలో అల్లరి నరేష్ బచ్చల మల్లి అనే ట్రాక్టర్ డ్రైవర్ పాత్రలో కనిపిస్తాడు. అతనిలో మూర్ఖత్వం మోతాదు చాలా ఎక్కువ. ఆ కారణంగా అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందన్నదే కథలో ఆసక్తికరమైన అంశం. అల్లరి నరేష్ సింగిల్ సిట్టింగ్‌లోఈ కథను ఓకే చేశాడు' అన్నారు. సినిమాకు 90ల నేపథ్యం తీసుకోవడానికి కారణాల్ని వివరిస్తూ 'ఈ సినిమాలో తండ్రీ తాలూకు ఎమోషనల్ పాయింట్‌తో పాటు చక్కటి ప్రేమకథ ఉంటుంది. ఇప్పటి సెల్‌ఫోన్, సోషల్‌మీడియా యుగంలో ప్రేమకథల్ని భావోద్వేగభరితంగా చూపించలేకపోతున్నాం. సెల్‌ఫోన్‌లేని సమయంలో వచ్చిన ప్రేమకథలు హృదయాలను కట్టిపడేసేవి. లవ్‌స్టోరీని హార్ట్ టచింగ్‌గా చెప్పాలనే ఉద్దేశంతో 90ల నేపథ్యాన్ని ఎంచుకున్నా' అని తెలిపారు. బచ్చల మల్లి క్యారెక్టర్‌లో అల్లరి నరేష్ జీవించాడని, ఆయన కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర అవుతుందని, 'సీతారామం' వంటి చిత్రానికి పనిచేసిన విశాల్ చంద్రశేఖర్ సంగీతాన్నందించాడని, నాలుగు పాటలు హైలైట్‌గా నిలుస్తాయని సుబ్బు మంగాదేవి పేర్కొన్నారు.

యథార్థ కథతో 'సమిధ'

ఆదిత్య శశికుమార్, చాందిని తమిళరసన్, లావణ్య సాహుకార జంటగా నటిస్తున్న చిత్రం 'సమిధ'. సతీష్ మాలెంపాటి దర్శకుడు. అరుణం ఫిలింస్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ నెల 14న విడుదలకానుంది. రాజస్థాన్‌లో జరిగిన ఓ యథార్థ కథను స్ఫూర్తిగా తీసుకొని మర్డర్ మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ సినిమాను తెరకెక్కించామని, ఆద్యంతం అనూహ్య మలుపులు, యాక్షన్ హంగులతో ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. ఈ థ్రిల్లర్ కథలో చక్కటి ప్రేమకథ కూడా ఉంటుందని హీరో ఆదిత్య శశికుమార్ తెలిపారు. రవికాలే, కృష్ణమురళి, శ్రవణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సి.విజయశ్రీ, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: సతీష్ మాలెంపాటి.

సస్పెన్స్ థ్రిల్లర్ 'జిన్'

అమిత్ రావ్ హీరోగా నటిస్తున్న హారర్ థ్రిల్లర్ 'జిన్' శనివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. చిన్మయ్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిఖిల్ ఎమ్ గౌడ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్‌నివ్వగా, గీత రచయిత రామజోగయ్యశాస్త్రి కెమెరా స్విచాన్ చేశారు. వచ్చేవారం హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని, తెలుగు, కన్నడ ద్విభాషా చిత్రంగా తెరకెక్కిస్తున్నామని నిర్మాత పేర్కొన్నారు. విభిన్నమైన హారర్ థ్రిల్లర్ కథాంశమని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని దర్శకుడు తెలిపారు. పర్వీజ్ సింబా, ప్రకాష్ తుంబినాడు, రవిభట్, సంగీత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సునీల్ హోన్నాళి, సంగీతం: అలెక్స్, కథ, స్క్రీన్‌ప్లే: పర్వీజ్ సింభ, దర్శకత్వం: చిన్మయ్ రామ్.



లోపలికి రా చెప్తా..

కొండా వెంకటరాజేంద్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న హారర్ కామెడీ డ్రామా 'లోపలికి రా చెప్తా'. మనీషా జష్మాని, సుస్మిత అనాలా, సాంచిరాయ్ కీలక పాత్రధారులు. లక్ష్మీగణేశ్, వెంకటరాజేంద్ర నిర్మాతలు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రమోషన్‌లో భాగంగా సినిమాలోని తొలి పాటను మేకర్స్ విడుదల చేశారు. డెలివరీ బోయ్ జాఫర్ ఈ పాటను విడుదల చేయడం విశేషం. ఈ కథలో హీరో డెలివరీ బోయ్. అందుకే మొదటి పాటను డెలివరీ బోయ్‌తో విడుదల చేయించాం. డేవ్ జాండ్ సంగీత దర్శకత్వంలో కపిల్ కపిలన్ పాడిన ఈ పాట సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని నటుడు, దర్శక,నిర్మాత వెంకటరాజేంద్ర తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రేవంత్ లేవాక, అరవింద్ గణేశ్.

నేల మీది నక్షత్రమా

వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ప్రేమ కథాచిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' ఉపశీర్షిక. ధర్మ, ఐశ్వర్యశర్మ జంటగా నటిస్తున్నారు. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మాతలు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఈ సినిమాలోని పాటను విడుదల చేశారు. 'ఆకాశమంత చిలిపితనం.. అంతరిక్షమంత పసితనం.. మేఘమాల లాంటి పడుచుతనం.. మధ్యలోనే ఉరిమే గడుసుతనం.. నేలమీది నక్షత్రమా..' అంటూ సాగే ఈ పాటను చంద్రబోస్ రాయగా, శ్రీవసంత్ స్వరపరిచారు. అనుదీప్ దేవ్ పాడారు. హీరోయిన్‌పై హీరోకు ఉన్న ప్రేమను ఆవిష్కరించేలా చంద్రబోస్ ఈ పాట రాశారని, సినిమాకు ఈ పాట హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రశాంత్ అంకిరెడ్డి.

మదర్‌సెంటిమెంట్‌తో ఎర్రచీర

సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఎర్రచీర- ది బిగినింగ్'. స్వీయ దర్శకనిర్మాణంలో సుమన్‌బాబు తెరకెక్కిస్తున్నారు. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. మదర్‌సెంటిమెంట్, హారర్, యాక్షన్ అంశాలు కలబోసిన చిత్రమిదని, మూడొందల థియేటర్లలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకనిర్మాత, నటుడు సుమన్‌బాబు తెలిపారు. సెంటిమెంట్‌తో కూడిన హారర్ సినిమాలు తప్పకుండా సక్సెస్ అవుతాయని కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన నిర్మాత సి.కల్యాణ్ పేర్కొన్నారు. శ్రీరామ్, కమల్‌కామరాజు, కారుణ్య చౌదరి, అయ్యప్ప పి శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ పులిగార్ల, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సుమన్‌బాబు.